హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు

- పెళ్లిళ్లుంటేనే కడుపునిండా భోజనం.. లేకుంటే పస్తులే
- హాస్టల్‌లో ఉన్నది 11 మంది.. రిజిస్టర్‌లో 30 మందికిపైనే
- సమయానికి భోజనం పెడితే ఒట్టు
- ప్రతి రోజు కడుపుమాడ్చుకుంటున్న విద్యార్థులు
- భవనానికి నెలకు రూ.19 వేలు అద్దె
- మౌలిక సదుపాయాల్లేక విద్యార్థుల అవస్థలు




విద్యార్థులు తినకపోవడంతో మిగిన పొంగలి, మధ్యాహ్నం అరకొరగా వండిన అన్నం, వంకాయ కూర



తలుపులులేని బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు

కోవెలకుంట్ల: సంక్షేమ వసతి గృహాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నాం అంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. హాస్టళ్లలో విద్యార్థులకు కడుపునిండా భోజనం దొరక్క ఆకలి కేకలు పెడుతున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో ప్రతి రోజు విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, దొర్నిపాడు, తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కళాశాల హాస్టల్‌లో ఉంటూ పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, తదితర కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. హాస్టల్‌లో 30 మందికి పైగా విద్యార్థులున్నట్లు రికార్డుల్లో వివరాలు నమోదు చేశారు. వాస్తవానికి 11 మంది విద్యార్థులు మాత్రమే ఉంటున్నారు. వార్డెన్‌తో పాటు వంటమనిషి హాస్టల్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం ప్రతి రోజు విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రివేళల్లో భోజనం అందించాల్సి ఉంది. పట్టణంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఉంటే విద్యార్థులకు కడుపునిండా భోజనం అందుతుంది. హాస్టల్‌లో 11 మంది మాత్రమే విద్యార్థులు ఉండటంతో శుభకార్యాలు జరిగిన రోజున వార్డెన్ ఒకరిద్దరు విద్యార్థులతో అక్కడికి వెళ్లి భోజనం, ఇతర ఆహార పదార్థాలను తీసుకొచ్చి పెడుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. శుభకార్యాలు లేని రోజున అరకొరగా పెడుతూ కడుపు మాడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం శుక్రవారం ఉదయం పాలు, పెసరపప్పు పొంగలి, చట్నీ, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ, మధ్యాహ్నం అన్నం, పొటాటోకూర, మెంతికూర పప్పు, పెరుగు, సాయంత్రం అల్పాహారంగా ఉడికించిన శనగ గుగ్గిళ్లు, రాత్రి అన్నం, గుత్తి వంకాయ కూర, మజ్జిగ, రాత్రి పడుకునే ముందు జామ లేదా స్థానికంగా లభించే పండు ఇవ్వాల్సి ఉంది. కళాశాలలకు శ్రావణ శుక్రవారం, రెండవ శనివారం, ఆదివారంతో కలిపి మూడు రోజులు సెలవులున్నప్పటికీ పేద విద్యార్థులు కావడంతో ఇళ్లకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉండిపోయారు. విద్యార్థులకు మెనూ ప్రకారం కాకుండా ఉదయం పొంగలి పేరుతో మెత్తగా వండిన అన్నం, చాలీచాలని చెట్నీ పెట్టారు. అది తినలేక విద్యార్థులు పడేయగా అరకొరగా వండిన అన్నం కూడా మిగిలిపోయింది. మధ్యాహ్నానికి ఐదారు మందికి సరిపోయేలా ఉదయమే అన్నం, వంకాయ కూర వండి వంటమనిషి ఇంటికి వెళ్లిపోయింది. ప్రతి రోజు ఇలాగే అరకొరగా నాణ్యత లేని భోజనం, టిఫిన్ వడ్డిస్తున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల బయోమెట్రిక్ ఆధారంగా భోజనానికి సరిపడా బియ్యం, కందిపప్పు, ఇతర నిత్యావసర సరుకులు సరఫరా అవుతాయి. హాస్టల్‌లో 30 మందికి పైగా విద్యార్థులున్నట్లు రికార్డుల్లో ఉండగా వార్డెన్ మాయాజాలంతో రికార్డుల్లో ఉన్న విద్యార్థులందరికీ సరుకులు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు అరకొరగా భోజనం పెడుతుండగా మిగిలిన బియ్యం, ఇతర సరుకులు ఏమవుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా మారింది.

అద్దె భవనంలో అరకొర వసతులు



మూలనపడిన మినరల్ వాటర్ ప్లాంట్

కళాశాల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో నెలకు రూ.19 వేలు బాడుగ చెల్లిస్తూ అద్దె భవనంలో హాస్టల్‌ను కొనసాగిస్తున్నారు. హాస్టల్‌లో మూడు గదులకు సంబంధించి ఒకే ఒక ఫ్యాన్ ఉండటంతో రాత్రి వేళల్లో విద్యార్థులకు గాలి తగలక నిద్ర పట్టక ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూం, మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఒకరు లోపలికి వెళితే బయట ఒకరు వేచి ఉండి కాలకృత్యాలు, స్నానాలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. మంచినీరు అందించేందుకు ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయక మూలన పడటంతో తాగునీరు అంతంత మాత్రంగానే సరఫరా అవుతోంది. సరైన సమయానికి భోజనం అందక, హాస్టల్‌లో మౌలిక వసతులు లేక విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. హాస్టల్‌లో ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొన్నా సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు హాస్టల్‌వైపు కన్నెత్తి చూడకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. గత జూన్‌లో కళాశాలలు పునఃప్రారంభం కాగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు కావడంతో హాస్టల్ పరిస్థితులు బాగాలేకపోయినప్పటికీ ఇళ్లకు వెళ్లలేక, తమ బాధలు ఎవరికీ చెప్పుకోలేక కాలం వెళ్లదీస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమ బాగోగులు చూడాలని హాస్టల్ విద్యార్థులు కోరుతున్నారు.



విద్యార్థులు పడుకునే గదిలో పనిచేయని ఫ్యాన్

చౌడేశ్వరీ దేవికి పల్లకీ సేవ



అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్న పండితులు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం చౌడేశ్వరీ దేవికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు జరిగాయి. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో కొలువుంచి పల్లకీ సేవ, సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



వధూవరులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన వివాహ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని ధనలక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో డోన్‌కు చెందిన బొబ్బల రామచంద్రారెడ్డి కూతురు వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని కొండపైనున్న సీతారామ కల్యాణ మండపంలో శనివారం ఉదయం 10 గంటలకు వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకను ఆవోపా, డోన్ మానిక్యప్రభు సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

గుమ్మకొండలో రాతి దూలం పోటీలు.. మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీప కొండలో వెలసిన శ్రీబంగారుకొండ పాతపాలెం అభయాంజనేయస్వామికి శ్రావణ మాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆడపడుచులకు కుంకుమ,గాజులు అందించనున్నారు.సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భజనలు,సాయంత్రం స్వామి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం ఉంటుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఆదివారం రాతి దూలం పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

డోన్ టౌన్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని స్ఫూర్తి సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆలా మధు అన్నారు. శుక్రవారం పట్టణ సమీపంలోని జ్యోతిరావ్ పూలే గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వర రెడ్డి శుక్రవారం తెలిపారు. కొత్త బస్టాండ్ ఎదురుగా,పండరినగర్,మహాలక్ష్మి హాస్పిటల్, కృష్ణానగర్, కురుకుంద కాలనీ, కొత్తపేట, కొండపేట, పాతపేట ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొత్త బస్టాండ్, కేఈ మాదన్న నగర్, డేవిడ్ నగర్, శ్రీనివాస నగర్, ఆటోనగర్, ఇందిరానగర్, తారకరామ నగర్, సుందర్ సింగ్ కాలనీ, పాతబస్టాండ్, కంబాలపాడు రోడ్డు ప్రాంతాల్లో కరెంటు ఉండదని పేర్కొన్నారు.

రెండు రోజులు అంతరాయం.. మండలంలోని దేవరబండ సబ్‌స్టేషన్ పరిధిలోని మిద్దేపల్లె ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 11 కేవీ పనుల కారణంగా శని,ఆదివారాల్లో మిద్దేపల్లె, అనుంపల్లె, రేగులకుంట గ్రామాలకు రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ విద్యుత్ తెల్లవారు జామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇవ్వనున్నట్లు వివరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఆకుమల్ల ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రమణయ్య

సంజామల: గ్రామాల్లో అల్లర్లకు దూరంగా ఉండి ప్రశాంత జీవితం గడపాలని ఎస్‌ఐ రమణయ్య సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో శుక్రవారం ఎస్‌ఐ రమణయ్య గ్రామ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాలలో సమస్యలను సృష్టిస్తూ నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. రౌడీ షీటర్లు తీరు మార్చుకోవాలని గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వసంతపురం క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

వైభవంగా శ్రీశైలగిరి ప్రదక్షిణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించింది. సాయంత్రం స్వామిఅమ్మవార్ల మహామంగళహారతుల అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపారు. పల్లకీ ఊరేగింపుతో శ్రీశైల గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మగుడి, నందిమండపం, గంగాసదనం, బయలు వీరభద్రస్వామి ఆలయం, రింగ్ రోడ్డు, ఫిల్టర్‌బెడ్, సిద్దరామప్ప కొలను, పుష్కరిణి వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి తిరిగి నందిమండపం, ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుంది.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి



డోన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్,సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి శివరాం అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమన్నారు. ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా శుక్రవారం స్థానిక బేతంచెర్ల సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం కేంద్ర హోం మంత్రి ఆదేశాలతో విదేశీయుల స్థానికుల పేర్లు తొలగించి ఇతర ప్రాంతాల వారి పేర్లు నమోదు చేసి బీజేపీకి రాయజకీయంగా లబ్ధి చేకూరస్తుందని ఆరోపించారు. ఐద్వా నాయకులు షమీమ్‌బేగం,సిరినా,డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నక్కి హరి,హబీబ్ బాషా ఉన్నారు.

బేతంచెర్ల: బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధు శేఖర్ ఆరోపించారు. ఆ సవరణను వ్యతిరేకిస్తూ పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

బస్టాండు వద్ద డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్

కోవెలకుంట్ల: చిన్నపాటి వర్షాలకే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయం అవుతుండటంతో ఆర్టీసీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షపునీరు చుట్టుముట్టి ఇన్‌గేట్, ఔట్ గేట్ దారుల్లో మోకాలిలోతు నీటితో పాటు బస్సులు నిలిచే ఫ్లాట్‌ఫాం వరకు వర్షపు నీరు చేరుతోంది. దీంతో బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'బస్టాండ్ ప్రాంగణం.. బురదమయం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ఆవరణలో డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. డిపో మేనేజర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొక్లెయిన్‌తో అవుట్ గేట్ నుంచి బస్టాండ్ ఆవరణ వరకు కాల్వ తీయించారు. బస్టాండ్ ప్రాంగణంలో వర్షపునీటి నిల్వ ఏర్పడకుండా కాల్వను ఏర్పాటు చేసి మేజర్ గ్రామ పంచాయతీ డ్రైనేజీకి అనుసంధానం చేయనున్నట్లు డిపో అధికారులు తెలిపారు.



ప్రొక్లెయిన్‌తో కాల్వ తీస్తున్న దృశ్యం



మద్దిలేటిస్వామి క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: వరాలు ప్రసాదించే వరలక్ష్మీ వ్రతాన్ని మండలంలోని గ్రామాలు, పట్టణంలోని దేవాలయాల్లో మహిళలు శుక్రవారం సామూహికంగా భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీ మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఉపకమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ముందుగా..వేదపండితులు జ్వాలా చక్రవర్తి, ఆలయ ప్రధాన అర్చకులచే స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తులసీమాలార్చన, సహస్రనామార్చనతో పాటు శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగించారు. అనంతరం వేదపండితులు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించి వ్రత మహత్యాన్ని వివరించారు. పూజకు హాజరైన మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు. పూజలో పాల్గొన్న మహిళలకు కలశం, శేష వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. అలాగే.. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో సరస్వతీ మాతకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



కొండపేటలో అలంకరణలో యల్లమ్మ



డోన్‌లో కనకదుర్గకు కరెన్సీ నోట్లతో అలంకరణ

డోన్ టౌన్ : పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు వారి ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

బనగానపల్లె రూరల్: శ్రావణమాస మూడవ శుక్రవారం సందర్భంగా మండలంలోని నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మీవ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన మండపంలో చౌడేశ్వరిదేవి విగ్రహాన్ని కొలువుంచి సుమారు 2 వేల మంది ముత్తైదువులచే సామూహిక వ్రతం చేయించారు. అమ్మవారికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కోవెలకుంట్ల: పట్టణ శివారులో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం, పట్టణంలోని సత్య సాయిబాబా ఆలయంతో పాటు మండలంలోని భీమునిపాడు, గుళ్లదూర్తి, రేవనూరు, లింగాల, బిజనవేముల, జోళదరాశి, అమడాల, సౌదరదిన్నె గ్రామాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతం ఘనంగా చేపట్టారు. ఆయా ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

కొలిమిగుండ్ల: మండలంలోని పెట్నికోట కాశీవిశ్వనాథుని ఆలయంలో గిరిబాబుస్వామి ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పండుగల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ పండుగల ప్రాముఖ్యతను తెలుసుకున్నప్పుడే సమాజంలో శాంతి సౌఖ్యాలు నెలకొంటాయని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని రేవనూరులో టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల నుంచి ధార్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సామూహిక గోపూజ, వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. శ్రీమద్రామాయణం, భగవద్గీత, మహాభారతంలోని పలు అంశాలను టీటీడీ ధర్మ ప్రచారకులు జయదేవానంద వివరించారు. సర్పంచ్ సరస్వతమ్మ, ఆలయ ధర్మకర్త సంజీవరెడ్డి, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తిలో పూజల్లో పాల్గొన్న మహిళలు



రేవనూరులో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



పెట్నికోటలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

శ్మశాన వాటిక రస్తాను బాగుచేయండి

కొలిమిగుండ్ల: మృతి చెందిన వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే కుటుంబ సభ్యులు, బంధువులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఈసమస్య ఎక్కడో మారుమూల పల్లెలో అనుకుంటే పొరపాటే. సాక్షాత్తు మండల కేంద్రంలోనే ఈ పరిస్థితి నెలకొంది. గ్రామం మధ్యలో ఉన్న బ్రిడ్జి కింది భాగం నుంచి శ్మశాన వాటిక వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. బ్రిడ్జి వద్ద కిందకు దిగే చోట అస్తవ్యస్తంగా తయారైంది. కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి దారి కనిపించకుండా తయారైంది. మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్లే సమయంలో దారి సరిగా లేక కింద పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. వాగు మధ్యలో ఓ చోట మురికి నీళ్లలో దాటుకొని పోవాల్సి ఉంటుంది. కర్మకాండల సమయంలో రాత్రి వేళల్లో సమాధుల వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. పగలు నడిచిపోవాలంటేనే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది ఇక రాత్రిళ్లు చీకట్లో అవస్థలు వర్ణనాతీతం. నివాసాల ప్రజలు, వ్యాపారులు వ్యర్థాలను తీసుకెళ్లి అక్కడ పడేయంతో మరింత అపరిశుభ్రంగా మారింది. దాదాపు ఏడు నెలల క్రితం మంత్రి బీసీ జనార్ధన రెడ్డి బ్రిడ్జిపై నుంచి శ్మశాన వాటిక దారిని పరిశీలించారు. రస్తాను బాగు చేయాలని అధికారులను ఆదేశించినా ఇప్పటి వరకు ఆచరణకు నోచుకోలేదు. శ్మశాన వాటికకు చేరుకునేందుకు బ్రిడ్జి అవతల భాగం నుంచి రోడ్డు నిర్మిస్తే నేరుగా అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశానికి చేరుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు. ఈ విధంగా చేస్తే వాగును దాటాల్సిన అవసరం ఉండదన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



శ్మశాన వాటిక దారిలో పెరిగిన పిచ్చిమొక్కలు

యాదవులు ఐకమత్యంగా ఉండాలి

బనగానపల్లె రూరల్: యాదవులంతా ఐకమత్యంగా ఉండాలని అఖిల భారత యాదవ మహాసభ బనగానపల్లె నియోజవకర్గ కన్వీనర్ మద్దయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు చల్లా బాలస్వామి యాదవ్ సూచించారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామంలోని యాదవ అన్నదాన సత్రంలో యాదవ సంఘం సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న మద్దయ్య, బాలస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా యాదవులు విద్య, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, యాదవులు తమ పిల్లలను తప్పనిసరిగా చదివించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ యాదవ సంఘం గౌరవాధ్యక్షుడిగా సంజీవరాయుడు, అధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యక్షుడు ఏబీ హరియాదవ్, ప్రధాన కార్యదర్శి సతీష్, కార్యదర్శి శ్రీనివాసులు, ట్రెజరర్ మధు, కమిటీ సభ్యులుగా మరికొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అఖిలభారత యాదవ మహాసభ మండల అధ్యక్షుడు గణమద్దిలేటి, ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు బాలవెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు నాగేషు, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.



గ్రామ యాదవ మహాసభ కమిటీ సభ్యులతో నాయకులు

భ్రామరీకి లక్షకుంకుమార్చన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన సేవను జరిపించారు. వివిధ ప్రాంతాల 40 మంది భక్తులు పరోక్షసేవలో పాల్గొన్నారు.



లక్షకుంకుమార్చన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

జోరుగా వ్యవసాయ పనులు



ఆర్‌ఎస్ రంగాపురంలో కొర్ర పంటలో అంతరసేద్యం చేస్తున్న రైతులు

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో ఖరీఫ్‌లో సాగు చేసిన పంట పొలాల్లో అంతర సేద్యం పనులు ఊపందుకున్నాయి. ముద్దవరం, ఆర్‌ఎస్ రంగాపురం, గూటుపల్లె, బేతంచెర్ల, బుగ్గానిపల్లె, అంబాపురం, హెచ్.కొట్టాల గ్రామాల్లో సాగు చేసిన కంది, కొర్ర, పత్తి, సజ్జ, మొక్కజొన్న, మినుము పంటల్లో కూలీలతో కలుపు తొలగింపు, దెంత పట్టడం, ఎరువులు విత్తే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

మద్దిలేటి స్వామికి బంగారు ముఖావళి బహూకరణ

బేతంచెర్ల: మండలంలోని మద్దిలేటి నరసింహ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా స్వామి వారికి కర్నూలు నగరానికి చెందిన కుమారి లాశికా రామ్, కుమారి జ్యోశికా రామ్ బంగారు పూత ముఖావళిని సమర్పించారు. అలాగే..బండిఆత్మకూరు మండలం, ఎర్రగుంట్ల పల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి.. మహాలక్ష్మి అమ్మవారికి బంగారు పూత కవచం అందజేశారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేద పండితులు దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వదించారు.



శ్రీ మద్దిలేటి నరసింహస్వామికి బంగారు పూత ముఖావళి



మహాలక్ష్మి అమ్మవారికి బంగారు పూత కవచం